క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఒరవడులు



రామవరప్పాడు:ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన ఒరవడులు సంతరించుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్ఐఈఈ ఎంపవరింగ్ ఇంజినీర్స్ సహకారంతో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అంశంపై జరుగుతున్న వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఏకాంబరం నాయుడు ప్రారంభించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, సెక్రటరి శ్రీకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐఈఈ మెనేజింగ్ డైరెక్టర్ మదన్ మోహన్ గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



పెనమలూరు:విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తీయించారు. బందరు రోడ్డుకు ఇరుపక్కల చిరు వ్యాపారులు రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేయటంతో తరచుగా బందరు రోడ్డు పై ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి పోరంకి నుంచి పెనమలూరు సెంటర్ వరకు రోడ్డు మార్జిన్‌లలో ఉన్న ఆక్రమణలు తీయించారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, సిబ్బంది ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు.

నిత్యావసరాలపై జీఎస్టీ మినహాయించాలి

కంకిపాడు:నిత్యావసరాలపై జీఎస్టీ మినహాయించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పేదలకు అందనంత దూరంలో నిత్యావసర సరుకులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాలపై జీఎస్టీ మినహాయిస్తే ధరలు అదుపులోకి వస్తాయన్నారు. జీఎస్టీ మినహాయింపుతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కేంద్రం తక్షణమే జీఎస్టీ మినహాయింపు జాబితాలో నిత్యావసర సరుకులను చేర్చి పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలవాలని కోరారు.

చిన్నారి శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్:వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న ఓ బాలికకు శస్త్రచికిత్స నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.62 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసింది. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన ఎం.రమేష్‌కుమార్ కుమార్తె అంకిత (13)కి వెన్నుపూస సమస్య రావటంతో వైద్యం కోసం పలు ఆస్పత్రులు తిరిగారు. ఈ నేపథ్యంలో డాక్టర్లు తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని, అధిక ఖర్చుతో కూడుకుందని సూచించారు. దీంతో రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నడిపే రమేష్‌కుమార్‌కు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖను ఆశ్రయించటంతో పలువురు సభ్యులు సాయం అందించేందుకు ముందుకువచ్చారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ తరుపున రూ.20 వేలు, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు రూ.10 వేలు, కంచి వెంకటేశ్వరరావు రూ.10 వేలు, మెడివ్యాలీ హాస్పటల్స్ ఎండీ పంచకర్ల రమేష్ చక్రవర్తి రూ. 10 వేలు విరాళం అందించటంతో పాటుగా మరికొంత మంది సభ్యుల నుంచి సేకరించిన మొత్తాన్ని చిన్నారి అంకితకు అందించారు. మానవత సభ్యులు గంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, వడ్డి రాజేశ్వరరావు, జన్యావుల సత్యనారాయణ, మరీదు వెంకటస్వామి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై పోటీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశాల మేరకు నగరంలోని పలు విద్యా సంస్థల్లో వీఎంసీ సిబ్బంది 'స్వచ్ఛోత్సవ్-స్వచ్ఛత హీ సేవా'లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన పెంచేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఎంకే బేగ్ స్కూల్, ఎస్ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్ స్కూల్, ఏపీఎస్ఆర్ఎం స్కూల్, సెయింట్ జాన్ తదితర స్కూల్స్‌లో పోటీలు నిర్వహించారు. అక్టోబరు 2వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వీఎంసీ సిబ్బంది తెలిపారు.

దసరా ఉత్సవాలకు పూర్తికాని ఏర్పాట్లు!

- సక్రమంగా జరిగేనా అని భక్తుల్లో సందేహాలు
- ఇప్పటివరకు ఏ విధమైన పనులు చేయని వైనం
- సర్వత్రా విమర్శలు వ్యక్తం

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే దసరా ఉత్సవాలు ఈ సంవత్సరం అంతే వైభవంగా జరుగుతాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు అమ్మవారి అలంకారములు చేయనున్నారు. ఉత్సవాలు ప్రారంభానికి మూడు రోజులు కూడా సమయం లేదు. కానీ ఆలయంలో ఏర్పాట్లు మాత్రం పూర్తి కాలేదు. గతేడాది ధర్మకర్తల మండలి నియామకం జరగకపోవడానికి తోడు పర్యవేక్షణ లోపంతో ఉత్సవాల నిర్వహణలో లోపాలు తలెత్తాయి. ఆలయ డెకరేషన్, అమ్మవారి అలంకారాలు, విద్యుత్ అలంకారణ, ప్రసాదాలు, భోజన నిర్వహణ వంటి అంశాల్లో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా ఉత్సవాల్లో స్థానిక టీడీపీ నాయకుల పెత్తనం భక్తులకు తలనొప్పిగా మారింది. ఈసారి మూడు రోజుల్లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల్లో కూడా ఇంతే ఇబ్బందులు తలెత్తుతాయా



పేరంటాలమ్మ ఆలయం

అన్న అనుమానాలు భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ధర్మకర్తల మండలి నియామాకానికి ఇటీవల నోటిఫికేషన్ వెలువడినా నియామకం జరగలేదు. దీంతో ఈ సారి కూడా ఉత్సవాల్లో ధర్మకర్తల మండలి ప్రమేయం లేనట్టే.

వెలిసిపోయిన రంగులు

పేరంటాలమ్మ ఆలయానికి ప్రతి రెండు సంవత్సరాల కొకసారి రంగులు వేయిస్తారు. గతేడాది సంక్రాంతి పండుగకు ముందు ఆలయ గోపురం, గోడలు, ప్రాంగణంలో రంగులు వేయించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రంగుల పని కాంట్రాక్ట్ అధికార బలంతో చేజిక్కించుకున్నాడు. ఆలయానికి రంగులు వేసిన మూడు నెలలకే డొల్లతనం బయటపడింది. రంగులు వెలిసిపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆలయం వెనుక వైపు రైవస్ కాలువ సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఉత్సవాలు దగ్గరపడుతున్నా చెత్త తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తోంది. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో వెనుక ఉన్న మరుగుదొడ్లకు ఎప్పుడు చూసిన తాళాలు వేసి ఉంటున్నాయని ఇలాగైతే ఎలా ఉపయోగించుకోగలమంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. అమ్మవారి అలంకారముకు రోజుకు రూ.15వేలు చొప్పున దాతలు, భక్తులు విరాళాలు అందజేస్తుంటారు. విరాళాలు విరివిగా వస్తున్నా ఉత్సవాలు ఏర్పాట్లు ఘనంగా జరగడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. విరాళాలు ఎంత వచ్చాయి, ఎంత ఖర్చు చేశారు వంటి వివరాలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సంవత్సం కూడా అమ్మవారి అలంకారములకు, విద్యుత్ అలంకారానికి, భోజన, ప్రసాదాలకు దాతలు విరాళాలు అందజేసారని వీటిని సక్రమంగా వినియోగించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆలయంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వ్యాక్సిన్‌తో వ్యాధుల నుంచి రక్షణ



కంకిపాడు:వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్‌చంద్ సూచించారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. వ్యాధులు నుంచి రక్షణ పొందాలంటే వ్యాక్సిన్ ద్వారానే సాధ్యమన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని తెలిపారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవటం ద్వారా కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సీడీపీఓ బేబీ సుకన్య వివరించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుధా ప్రసూజ, సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ రోహిణీకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళనకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కంకిపాడు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు చేపట్టిన చలో మెడికల్ కాలేజ్ మచిలీపట్నం ఆందోళనకు పెనమలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. దావులూరు టోల్‌గేట్, ఉయ్యూరు బైపాస్ సెంటర్ల నుంచి కార్యకర్తలు, నాయకులు బయలుదేరారు. దావులూరు టోల్‌గేట్ వద్ద కార్యకర్తల ర్యాలీని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు వైద్యవిద్య అందుబాటులో ఉండాలనే ఆకాంక్షతో మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అభివృద్ధిని ఒప్పుకునే ధైర్యం లేక కూటమి ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరావు,



దావులూరు టోల్‌గేట్ వద్ద పెనమలూరు, కంకిపాడు మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాష్ట్ర బీసీ సెల్ నేతలు నక్కా శ్రీనివాసరావు, కొండవీటి సుబ్బారావు, చక్కా ఆనంద్, గుమ్మడి విజయ్ కుమార్, కలపాల వజ్రాలు, సిహెచ్ మహేష్, మాదు నాగహరీష్, మాదు రాఘవేంద్రరావు, జె.నాగేశ్వరరావు, రవి, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా



గన్నవరంలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు



కంకిపాడులో ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు


గన్నవరం:స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లు చేపట్టిన ధర్నా శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు మిరంపల్లి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వీఆర్ఏలకు పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్ఏలకు వీఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించాలని కోరారు. నామిని వీఆర్ఏలను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలిపారు. తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. సంఘం కార్యదర్శి జీ. రామకృష్ణ, కోశాధికారి డి. అనూష, సభ్యులు సుజాత, గీత, జోస్పిన్, సువర్ణ, ఝాన్సీ, జ్యోతి, లక్ష్మీ, పద్మారావు, షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు దేవరపల్లి జ్యోతి డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని విజ్ఞప్తిచేశారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు చేపట్టే దశలవారీ ఆందోళనల్లో వీఆర్ఏలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జుజ్జవరపు బాలయ్య, బంద్రపల్లి రవీంద్ర, కుందేరు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని వీఆర్ఏలు తమ విధులు బహిష్కరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమ డిమాండ్లు పరిష్కారించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీఆర్ఏలకు వేతనాలు పెంచాలని, పేస్కేలు అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను పరిష్కారించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వీఆర్ఏల ఆందోళనకు గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో) సంఘం నాయకులు నర్రా నాగరాజు, సీమోను, సునీల్, గాబ్రియేలు కలిసి తమ సంఘీభావం తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వీకేఆర్ విద్యార్థులు

గన్నవరం:మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజయవాడలో ఇటీవల జిల్లా స్థాయిలో సెలక్షన్స్ నిర్వహించినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ కళాశాలకు చెందిన ఎ.రెహాన్, పి. దుష్యంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు సెలక్టర్లు ఎంపిక చేసినట్లు తెలిపారు. గుంటూరులో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్-19 పోటీల్లో ఇద్దరు విద్యార్థులు జిల్లా జట్టుకు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన డి. నాగరాజును ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకులు ఆర్. శ్రీనివాసరావు, కె.నాగరాజు. కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే సామర్థ్యం ఉండాలి

పెనమలూరు:విద్యార్థులు సమస్యలు పరిష్కరించే సామర్థ్యంతో ఉండాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, అనువాదిని ఏఐ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ బుద్ధ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై జాతీయస్థాయిలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులను ప్రోత్సహించటానికి స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లు, రైతులు సమస్యలు, ఆహార ఉత్పత్తులు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ఏఎస్‌టీయు విజయనగరం ఉపకులపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, సహకార పరిశోధనల పై దృష్టి పెట్టాలన్నారు. జాతీయ స్థాయిలో 308 పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌కు చెందిన డేటావ్యాలీ సీఈవో చలమలశెట్టి పవన్, డైరెక్టర్ డీకెఆర్‌కె.రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ డాక్టర్ రాజేష్ గోగినేని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మెగా రక్తదాన శిబిరం

పెనమలూరు:వరల్డ్ బ్లడ్ క్యాన్సర్ అవేర్‌నెస్ నెల సందర్భంగా వీఆర్ విత్‌యూ చారిటబుల్ ట్రస్టు, అశోక్ జిమ్, మాతృహృదయ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన మెగా రక్తదాన శిబినం నిర్వహిస్తున్నామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. కానూరులో శుక్రవారం బాడీ బిల్డింగ్ క్రీడాకారులతో కలిసి ఆయన రక్తదాన పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. క్యాన్సర్ బాధితులు, అత్యవసర సమయంలో రక్తం అవసరమున్న బాధితులను ఆదుకోవటానికి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు, దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కుటుంబ పోషణలో పురుషుల భాగస్వామ్యం

పెనమలూరు:ఆరోగ్యవంతమైన మహిళా సమాజంతోనే కుటుంబాలు శక్తివంతంగా ఉంటాయని సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. కానూరు 6,12 అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణమాసం 2025 లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ జీ.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, బాలాంతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

గోసాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనరాణి మాట్లాడుతూ కుటుంబ పోషణలో పురుషుల భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. పురుషులతో పోషకాహార వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. గోసాల-7, వణుకూరు -4 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.



కానూరులో పాల్గొన్న సీడీపీవో బేబీసుకన్య



గోసాలలో వంటలు వండుతున్న పురుషులు

వంటల పోటీలు నిర్వహణ....

గన్నవరం:మండలంలోని మర్లపాలెం పాలకేంద్రం ఆవరణలో శుక్రవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార వంటల పోటీలు జరిపారు. ఆకుకూరలు, మునగాకు, కరివేపాకు కారం తయారుచేశారు. అనంతరం డాక్టర్ శ్రీహర్ష మాట్లాడారు. సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి, సీహెచ్ఓ వీవీ కుమారి, హెచ్‌వీ రేణురాజ్యం, హెచ్ఎస్ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ సీతారామయ్య, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జీ. మంగమ్మ మాట్లాడారు. పురుషుల భాగస్వామ్యంతో పోషకాహార వంటలు తయారు చేసి చూపించారు. వార్డు సభ్యులు సరిత, సెక్టార్ సూపర్‌వైజర్ పద్మాదేవి, ఏఎన్ఎం వీరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

గన్నవరం రూరల్:మండలంలోని బీబీగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం-2025 మాసోత్సవాల్లో భాగంగా సుపోషిత్ భారత్‌ను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. గ్రామీణ శక్తికి మార్గం, పోషణకు బలమైన పునాది, శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు, బాల్యదశ విద్య సంరక్షణ, పోషణకు బలమైన అడుగులను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎల్.ఝాన్సీ, జి.శివకుమారి, కె.సునీత, షాలిని తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి....

హనుమాన్‌జంక్షన్ రూరల్:గర్భిణుల పోషణ, పసిపిల్లల సంరక్షణలో కేవలం మహిళలే కాకుండా పురుషుల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని ఐసీడీఎస్ వీరవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని 'పురుషుల భాగస్వామ్యం'పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలత, ఏఎన్ఎం సుభాషిణి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. దీని ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

ఉయ్యూరు రూరల్:పురుషుల భాగస్వామ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు అని ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని పెదఓగిరాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్, చిన్న ఓగిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి తేజస్విని పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్.శివశంకర్, పెదఓగిరాల సర్పంచ్ త్రిపురం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కపా కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన నీటి వినియోగంపై అవగాహన

ఉంగుటూరు(గన్నవరం):ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో శుక్రవారం ఉషారామ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి శుద్ధమైన తాగునీటి ప్రాముఖ్యత, నీటి వనరుల సంరక్షణ గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి. శ్రీహరిబాబు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులచే గ్రామస్తులకు వర్షపు నీటి సంరక్షణ, నీటి వృథాను అరికట్టడం, శుభ్రమైన నీటి వినియోగంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. గ్రామస్తులతో తాగునీటి సమస్యలు-పరిష్కార మార్గాలపై చర్చించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకెఎస్‌వీ ప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



గ్రామంలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉచితంగా వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో బాపులపాడు మండలం కె.సీతారామపురంలో శుక్రవారం మహిళలు, బాలికలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ చెన్నుబోయిన వెంకట లక్ష్మీ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్ సాగర్ 100 మంది మహిళలు, బాలికలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అప్తమాలజీస్ట్ ఏడుకొండలు, హెల్త్ సూపర్‌వైజర్ శరత్‌చంద్ర ఉన్నారు.

వికాస్‌లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

విజయవాడరూరల్: సమాజానికి శాశ్వతమైన అభివృద్ధి కల్పించాలంటే స్వచ్ఛమైన, పునరుత్పత్తి అయ్యే ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిట్ వరంగల్ ప్రొఫెసర్ అంబా ప్రసాదరావు అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ లో రెండు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిట్ వరంగల్ ప్రొఫెసర్ అంబా ప్రసాదరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన అల్టర్నేట్ ఫ్యూయల్స్- ది ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశం పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విట్ అమరావతి ప్రొఫెసర్ అనిల్ విఠల్‌రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ లో వస్తున్న కొత్త ఆవిష్కరణలు, డేటా భద్రత ప్రాముఖ్యతపై ప్రసంగించారు. కార్యదర్శి ఎస్.సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఫణి నివేదికను సమర్పించారు. ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి టి.కిషోర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి జి.శేఖర్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



22 నుంచి శరన్నవరాత్రులు

పెనమలూరు:చోడవరం నాగేంద్రస్వామివారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు తిరునగిరి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. తొలిరోజు బొమ్మిశెట్టి శివకుమార్ దంపతులు పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రకటన

[illegible]

చోరీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: చోరీ ఘటనపై కంకిపాడు పోలీస్ స్టేషన్లో శుక్రవారం రాత్రి కేసు నమోదయింది. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాలు మేరకు... ఈడుపుగల్లు బీసీ కాలనీ చెందిన షేక్ ఫాతిమా కుటుంబం ఈ నెల ఏడో తేదీన తెనాలిలోని బంధువులు ఇంటికి వెళ్లి శుక్రవారం తిరిగివచ్చారు. వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గమనించి చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చోరీ ఘటనలో రూ.30 వేల నగదు, 300 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఉత్సాహంగా షటిల్ పోటీలు



కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి షటిల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. కంకిపాడు జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం షటిల్ టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఎస్ఎంసీ చైర్మన్ అజ్గర్ షరీఫ్ ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. అండర్-14 బాలికల విభాగంలో ప్రొద్దుటూరు ప్రథమస్థానం, మంతెన జెడ్పీ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్-17 బాలికల విభాగంలో మంతెన ప్రథమస్థానంలోనూ, కంకిపాడు జెడ్పీ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. పోటీలను ఇన్‌చార్జి హెచ్ఎం యు.నాగేశ్వరరావు, పీడీలు లకనం దుర్గాప్రసాద్, యడవల్లి మురళీ, సిహెచ్ సుశీల, రామలక్ష్మి పర్యవేక్షించారు.